క్లుప్తంగా

జెడ్పీటీసీ వెన్న ఇందిరకు పితృవియోగం


గాయం వెంకట రామిరెడ్డి (ఫైల్)

తర్లుపాడు: మండల జెడ్పీటీసీ సభ్యురాలు వెన్న ఇందిర తండ్రి, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు గాయం వెంకట రామిరెడ్డి (89) అనారోగ్యానికి గురై ఒంగోలులోని కిమ్స్ వైద్యశాలలో శనివారం మృతిచెందారు. మండలంలోని పలు ప్రాంతాల్లో జెడ్పీ ప్రధానోపాధ్యాయునిగా వెంకట రామిరెడ్డి విధులు నిర్వహించారు. ఈయనకు నలుగురు కుమార్తెలు. వెన్న ఇందిర తర్లుపాడు జెడ్పీటీసీగానూ, వీహెచ్ఆర్ విద్యాసంస్థలకు చైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తున్నారు. గాయం వెంకట రామిరెడ్డి ఉపాధ్యాయుడుగా కొనసాగుతూనే వివిధ సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవారు. శ్రీశైలంలోని రెడ్డి సంక్షేమ సంఘం కార్యదర్శిగా, రెడ్డి పరివార్ సంఘ కార్యదర్శిగా పనిచేశారు. కంభం నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే ఉడుముల వెంకటరెడ్డికి ఈయన స్వయానా బావమరిది. ఈయన మృతిపట్ల వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి, అల్లుడు వెన్న హనుమారెడ్డి తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. మండలంలోని పలువురు ప్రజా ప్రతినిధులు తర్లుపాడులోని ఆయన స్వగృహంలో మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

వక్ఫ్‌బోర్డు భూముల కౌలు వేలం


భూముల కౌలు వేలం నిర్వహిస్తున్న అధికారులు

పొదిలి: స్థానిక వక్ఫ్‌బోర్డు కౌలు భూముల వేలం శనివారం పెద్ద మసీదు వద్ద జరిగింది. తహసీల్దార్ ఎంవీ.కృష్ణారెడ్డి, వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్, పోలీసుల సమక్షంలో కౌలు వేలం పాటలు జరిగాయి. మొత్తం 97 ఎకరాలకు గాను రూ.5.20 లక్షల కౌలు వచ్చిందని అధికారులు తెలిపారు. మిగిలిన భూములను కూడా త్వరితగతిన వేలం వేస్తామన్నారు. వక్ఫ్‌బోర్డు భూములు అన్యాక్రాంతం అయ్యాయని, అధికారులు పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని టీడీపీ పట్టణ అధ్యక్షుడు ముల్లా ఖుద్దూస్ డిమాండ్ చేశారు. ఆక్రమణల్లో కొన్నింటిని అధికారులు పరిశీలించారు. ఆక్రమణలపై విచారణ చేయించి వాస్తవమైతే తగు చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ కృష్ణారెడ్డి చెప్పారు.

వైభవంగా చెన్నకేశవునికి శాంతి కల్యాణం


కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

మార్కాపురం టౌన్: పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవస్వామి దేవస్థానంలో వైభవంగా శాంతి కల్యాణం శనివారం అర్చకులు నిర్వహించారు. ఉభయ దేవేరులను ఆలయ మధ్యరంగ మండపం వద్దకు తీసుకొచ్చి ప్రతిష్ఠించి పలు రకాల పూలతో సుందరంగా అలంకరించి కల్యాణం నిర్వహించారు. కల్యాణోత్సవంలో పలువురు భక్తులు పాల్గొన్నారు. ఈఓ చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాట్లు చేశారు. అనంతరం అన్నదానం చేశారు.

రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ


పండ్లు పంపిణీ చేస్తున్న ఏపీయూడబ్ల్యూజే నాయకులు

మార్కాపురం: ఏపీయూడబ్ల్యూజే వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా శనివారం మార్కాపురంలోని జీజీహెచ్‌లో జిల్లా అధ్యక్షుడు ఎస్వీ రమణ ఆధ్వర్యంలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు రమణ మాట్లాడుతూ జర్నలిస్ట్ సమస్యల పరిష్కారం కోసం ఏపీయూడబ్ల్యూజే అనేక పోరాటాలు చేసిందని, భవిష్యత్‌లో కూడా జర్నలిస్టుల సంక్షేమం కోసం పోరాడుతుందని అన్నారు. కార్యక్రమంలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాకు చెందిన మహబూబ్ సుభాని, రాజు, శ్రీకాంత్, రామి రెడ్డి, నరేంద్ర, అన్ను, రఫీ, ఆదినారాయణ, షౌకత్ ఆలీ, శ్రీనివాస్, బషీర్, కెవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

గిద్దలూరు రూరల్: చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఓంకార్ అన్నారు. మండలంలోని వెల్లుపల్లె, అంబవరం గ్రామాల్లో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రజలు చట్టాల గురించి పూర్తిగా తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రోనోట్లు, బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన, బాల్యవివాహాల నిర్మూలన, సీనియర్ సిటిజన్ మెయింటెనింగ్ వంటి ఇతర చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. న్యాయస్థానం ఉచిత సేవలను అందించేందుకు అవకాశం కల్పిస్తుందన్నారు. న్యాయవాదులు, కోర్టు సిబ్బంది మధు పాల్గొన్నారు.

ఎస్ఎంసీ ఎన్నికల్లో

వైఎస్సార్‌సీపీ మద్దతుదారుల గెలుపు


అర్ధవీడు: చైర్మన్లతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఎంఈఓ లక్ష్మీనాయక్


కొమరోలు: విద్యాకమిటీ చైర్మన్‌తో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఎంఈఓ

- వద్దిమడుగు, నాగంపల్లిలో ఎన్నికలు వాయిదా
- పేరారెడ్డిపల్లి, చింతగుంటలో వైఎస్సార్ సీపీ మద్దతుదారులు ఎన్నిక
- పేరారెడ్డిపల్లిలో ఓటరు లిస్టు పేపర్లు చించిన టీడీపీ కార్యకర్త

పొదిలి రూరల్: పొదిలి మండలంలో అక్కచెరువు ఏపీ పాఠశాలలో శనివారం నిర్వహించిన ఎస్ఎంసీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రెసిడెంట్‌గా వేల్పుల నరసింహరావు, వైస్ ప్రెసిడెంట్‌గా వేల్పుల రోశమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మొత్తం 47 మంది విద్యార్థులు ఉన్న ఈ పాఠశాలలో ఓటింగ్‌కు 33 మంది హాజరు కావాల్సి ఉండగా 18 మంది మాత్రమే హాజరయ్యారు. వీరందరు కేవలం వైఎస్సార్‌సీపీకే చెందిన వ్యక్తికే మద్దతు తెలిపారు. టీడీపీ మద్దతుదారులు పోటీ చేయకపోవడంతో సమయానికి ఉన్న అభ్యర్థులచే పోటీ చేయించి ఏకగ్రీవం అయినట్లు అధికారులు ప్రకటించారు. దీంతో పాటు సభ్యులు కూడా అందరూ ఒకే పార్టీ మద్దతుదారులు వారు విజయం సాధించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి మామిళ్ళపల్లి శ్రీనివాసరెడ్డి, హెచ్ శ్రీనివాసరెడ్డి, ప్రెసిడెంట్ చేరెడ్డి నాగలక్ష్మి, నాయకులు చేరెడ్డి సుబ్బారెడ్డి, కొండలు, కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొమరోలు: మండలంలో వాయిదాపడిన 11 ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలలకు విద్యాకమిటీ చైర్మన్ ఎన్నికలు శనివారం ప్రశాంతంగా జరిగాయి. మండలంలోని అక్కపల్లె, బాదినేనిపల్లె, యర్రగుంట్ల, మిట్టమీదిపల్లె ఎంపీపీ పాఠశాలలకు, 7 ఎయిడెడ్ పాఠశాలలకు మండల విద్యాశాఖాధికారుల ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించి విద్యాకమిటీ చైర్మన్, వైస్ చైర్మన్లను ఎన్నుకున్నారు. మండల విద్యాశాఖాధికారులు కావడి వెంకటేశ్వర్లు, బొర్రా వెంకటరత్నం ఎన్నికలను పర్యవేక్షించారు. స్థానిక ఎస్సై మల్లికార్జునరావు తమ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు.

అర్ధవీడు (బేస్తవారిపేట): మండలంలో ఈ నెల 8వ తేదీన వాయిదా పడిన పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికలు శనివారం నిర్వహించారు. గన్నెపల్లె, పాపినేనిపల్లె ప్రాథమిక పాఠశాలల్లో, అర్ధవీడు గురుకుల పాఠశాలలో చైర్మన్, వైస్ చైర్మన్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పాపినేనిపల్లె హైస్కూల్లో కోరం లేకపోవడంతో ఎన్నికలు వాయిదా పడ్డాయి. ఎన్నికైన చైర్మన్లు, వైస్ చైర్మన్లతో ప్రమాణస్వీకారం చేయించారు. ఎంఈఓ లక్ష్మీనాయక్, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ బండి బలరామిరెడ్డి పాల్గొన్నారు.

కంభం: మండలంలోని యర్రబాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఎస్ఎంసీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. మండల విద్యాశాఖాధికారులు మాల్యాద్రి, శర్వాణిలు ఎన్నికల ప్రక్రియను పరిశీలించారు. ఎస్ఎంసీ చైర్మన్‌గా పిక్కిలి కాశీరావు, వైస్ చైర్మన్‌గా ఎలిజిబెత్ రాణి ఎంపికయ్యారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాస్, రంగారెడ్డి, గోన చెన్నకేశవులు, తోట శ్రీను పాల్గొన్నారు.

నాలుగు పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నిక

బేస్తవారిపేట: మండలంలోని మూడు ప్రాథమిక పాఠశాలల్లో, కొత్తపేట జెడ్పీ హైస్కూల్లో గతంలో కోరం లేక ఎస్ఎంసీ ఎన్నికలు వాయిదా పడ్డాయి. బార్లకుంట, శింగసానిపల్లె, ఖాజీపురం ప్రాథమిక పాఠశాలల్లో ఏకగ్రీవంగా, కొత్తపేట జెడ్పీ హైస్కూల్లో ఓటింగ్‌తో శనివారం ఎన్నికలు జరిగాయి. ఎన్నికలను ఎంఈఓ సీహెచ్ రమణారెడ్డి, ఎస్సై నరసింహారావు పర్యవేక్షించారు. నూతనంగా ఎన్నికైన చైర్మన్ల, వైస్ చైర్మన్లతో ప్రమాణస్వీకారం చేయించినట్లు ఎంఈఓ తెలిపారు. ఎన్నికల నిర్వహణకు సహకరించిన ఎస్సై నరసింహారావుకు ఎంఈఓ రమణారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

వద్దిమడుగు, నాగంపల్లిలో మళ్లీ వాయిదా

కొనకనమిట్ల: గతంలో పలు కారణాలతో నిలిచిన పాఠశాలల మేనేజింగ్ కమిటీ ఎన్నికలను మళ్లీ శనివారం అధికారులు నిర్వహించారు. పేరారెడ్డిపల్లి యూపీ, వద్దిమడుగు యూపీ, చేరెడ్డివారిపల్లి యూపీ, చింతగుంట హిందూ, ఏఏ, చౌటపల్లి ఏఏ, నాగంపల్లి ఏఏ పాఠశాలలకు సంబంధించి ఎన్నికలు నిర్వహించారు. అయితే కోరం లేక వద్దిమడుగు యూపీ, నాగంపల్లి ఏఏ పాఠశాలల ఎన్నికలను మళ్లీ వాయిదా వేశారు. మండలంలో ప్రాథమిక పాఠశాలలు 63, యూపీ పాఠశాలలు 7, జెడ్పీ పాఠశాలలు 8 కలిపి మొత్తం 78 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ఈ నెల 8న నిర్వహించిన ఎన్నికల్లో ఏకగ్రీంగా 50 ప్రాథమిక, యూపీ 4, జెడ్పీ 7 పాఠశాలల్లో చైర్మన్, వైస్ చైర్మన్‌లను ఎన్నుకున్నారు. ప్రాథమిక పాఠశాలలు 9, జెడ్పీ పాఠశాల 1లో ఓటింగ్ ద్వారా సభ్యులను ఎన్నుకున్నారు. శనివారం నిర్వహించిన ఎన్నికల్లో పేరారెడ్డిపల్లి, చేరెడ్డివారిపల్లి యూపీ పాఠశాలలు, చింతగుంట హిందూ, ఏఏ, చౌటపల్లి ఏఏ పాఠశాలల కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. చైర్మన్, వైస్ చైర్మన్‌లతో పాటు కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎస్ఐ మాధవరావు తన సిబ్బందితో పోలీస్ బందోబస్తు నిర్వహించారు.

పలు పాఠశాలల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు ఎన్నిక..

పాఠశాలల కమిటీ ఎన్నికలకు సంబంధించి వైఎస్సార్ సీపీ మద్దతుదారులు ఏకగ్రీంగా ఎన్నికయ్యారు. మండలంలోని పేరారెడ్డిపల్లి యూపీ పాఠశాలలో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులైన రావి వెంకటసుబ్బారెడ్డి చైర్మన్‌గా, వైస్ చైర్మన్‌గా గొంగటి కృపమ్మ ఏకగ్రీంగా ఎన్నికయ్యారు. చింతగుంట హిందూ పాఠశాల చైర్మన్‌గా పి.రాజయ్య, వైస్ చైర్మన్‌గా ఖాశింబి ఎన్నికయ్యారు.


అక్కచెరువు ఎస్ఎంసీ ఎన్నికల్లో గెలుపొందిన అభ్యర్థులతో అధికారులు


యర్రబాలెంలో చైర్మన్, వైస్ చైర్మన్‌లను అభినందిస్తున్న సర్పంచ్


కొత్తపేట హైస్కూల్లో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న అధికారులు


పేరారెడ్డిపల్లి పాఠశాల చైర్మన్‌గా నియామక పత్రం అందుకుంటున్న వెంకట సుబ్బారెడ్డి

పేరారెడ్డిపల్లిలో ఓటరు లిస్టు పేపర్లను చించిన టీడీపీ కార్యకర్త:

మండలంలోని పేరారెడ్డిపల్లి యూపీ పాఠశాల మేనేజింగ్ కమిటీ ఎన్నికల్లో నెగ్గలేకపోయామని ఎలాగైనా మళ్లీ ఎన్నిక వాయిదా వేయాలనే ఉద్దేశంతో టీడీపీ కార్యకర్త, పాఠశాలలో ఓటు హక్కు కలిగిన కె.బసవయ్య బయట నుంచి దూకుడుగా వచ్చి టేబుల్‌పై ఉన్న ఓటరు లిస్టు పేపర్లు చించి బయట వేశాడు. మావాళ్లు లేకుండా ఎన్నిక ఎలా జరుపుతారంటూ ఎన్నికల అధికారులతో గొడవకు దిగాడు. మీరు రాకుండా బయటకు వెళ్లారని అయినా సరిపడా కోరం ఉండటంతో ఉన్న సభ్యులతో ఏకగ్రీవంగా కమిటీని ఎన్నుకున్నట్లు అధికారులు తెలిపారు. ఎంఈఓ డాంగే షరీఫ్ వచ్చి సభ్యులు సంతకాలు పెట్టిన రికార్డులను చూసి కోరం ఉంటే ఎన్నిక జరపవచ్చని అన్నారు. చివరికి వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

వైద్యులకు రక్షణ కల్పించాలి



పొదిలిలో ర్యాలీలో పాల్గొన్న ప్రభుత్వ వైద్యులు, సిబ్బంది


గిద్దలూరులో వైఎస్సార్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న వైద్యులు

గిద్దలూరు రూరల్: వైద్యులకు రక్షణ కల్పించాలని గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సూరిబాబు అన్నారు. కోల్‌కత్తాలో విధి నిర్వహణలో ఉన్న వైద్యురాలిపై అత్యాచారానికి పాల్పడిన వారిని వెంటనే శిక్షించాలని కోరుతూ పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలోని వైద్యులు విధులు బహిష్కరించి ర్యాలీగా గాంధీబొమ్మ సెంటర్, కుమ్మరాంకట్ట సెంటర్, రైల్వేస్టేషన్ రోడ్డు, రాచర్ల గేట్ సెంటర్ వైఎస్సార్ విగ్రహం వద్దకు ర్యాలీ నిర్వహిస్తూ నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సూరిబాబు మాట్లాడుతూ వైద్యులపై అత్యాచారానికి పాల్పడిన వారిని వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు. వైద్యుల రక్షణ కోసం ప్రభుత్వం ప్రత్యేక చట్టాలు తీసుకురావాలన్నారు. డాక్టర్లు ఖాదరయ్య, శ్రీకాంత్, ఆయేషా, ప్రవీణ్‌కుమార్, గౌసియా, షాలినీ, విజయభాస్కర్, రమణారెడ్డి, శశికుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బేస్తవారిపేటలో..

బేస్తవారిపేట: పశ్చిమబెంగాల్ రాష్ట్రం కోల్‌కత నగరం ఆర్‌జీ కార్ వైద్యశాలలో అత్యాచార ఘటనకు నిరసనగా బేస్తవారిపేట మండలంలోని పీహెచ్‌సీ డాక్టర్లు, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలతో శనివారం భారీ ర్యాలీ నిర్వహించారు. బేస్తవారిపేట జంక్షన్ నుంచి నినాదాలు చేస్తూ ర్యాలీగా బస్టాండ్‌లో మానవహారంగా ఏర్పడ్డారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్లు పి.పృథ్వీరాజ్, రాహుల్, కావ్య, వర్షిణి, రమేష్‌కుమార్, లక్ష్మీజిలేందర్, మండల వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కంభం: ప్రాణం పోసే వైద్యులకే దేశంలో రక్షణ కరువైందని నిరసిస్తూ స్థానిక ప్రభుత్వ వైద్యశాల సిబ్బంది శనివారం పట్టణంలో ర్యాలీ చేశారు. స్థానిక ప్రభుత్వ వైద్యశాల నుంచి కందులాపురం కూడలి వరకు ప్లకార్డులు పట్టుకొని ర్యాలీ నిర్వహించారు. కందులాపురం కూడలిలో అంబేడ్కర్ విగ్రహం వద్ద పది నిమిషాల పాటు మానవహారంగా ఏర్పడ్డారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. పలువురు వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మౌనిత హత్యకు నిరసనగా శాంతి ర్యాలీ

పొదిలి: పశ్చిమ బెంగాల్‌లో వైద్య విద్యార్థిని డాక్టర్ మౌనిత హత్యకు నిరసనగా శనివారం ప్రభుత్వ వైద్యులు, సిబ్బంది, ఆర్ఎంపీ, పీఎంపీ అసోసియేషన్, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో నిర్వాహకులు మాట్లాడుతూ నిందితుడైన సివిల్ వాలంటీర్ సంజయ్ రాయ్ నేనే అత్యాచారం చేశాను, కావాలంటే నన్ను ఉరి తీసుకోండి అని చులకనగా, అవహేళనగా మాట్లాడుతున్నా అతనిపై ఎందుకు చర్యలు తీసుకోవటం లేదన్నారు. డాక్టర్ మౌనిత అక్కడ వైద్యశాలలో జరిగే సెక్స్ రాకెట్, ఆర్గాన్ ట్రేడ్, డ్రగ్ మాఫియాల గురించి బయటపెట్టినందుకే ఆమెను కిరాతకంగా అత్యాచారం చేసి హత్య చేశారని ఆరోపించారు. దీని వెనుక ప్రభుత్వ పెద్దల పాత్ర కూడా ఉందన్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం చేసి, వైద్యులకు రక్షణ కల్పించాలన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యులు డాక్టర్ ఆనంద్, డాక్టర్ ఎస్పీ బాలయ్య, సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, డాక్టర్ ఇమాంసా, డాక్టర్ భాస్కర్, యక్కలి శేషగిరిరావు, సామంతపూడి నాగేశ్వరరావు, బెల్లంకొండ విజయలక్ష్మి, వరికూటి శిరీష, లక్ష్మీనారాయణ, సాహితీ రాయల్, జీసీ సుబ్బారావు, బెల్లంకొండ శ్రీనివాసరావు, మువ్వల పార్థసారథి, కల్లం సుబ్బారెడ్డి, మెహరున్నీసా, కిరణ్మయి, బండి అశోక్, బాజీకరీముల్లా, గూడూరి వినోద్, కె.యల్లమందారెడ్డి, మేడా నరసింహారావు, ప్రభుత్వ, ప్రైవేటు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యులు కొవ్వొత్తుల ర్యాలీ

మార్కాపురం: కోల్‌కత్తాలో జరిగిన వైద్యురాలి హత్యాచారం కేసులో న్యాయం చేయాలని కోరుతూ మార్కాపురం పట్టణంలో పలువురు డాక్టర్లు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఐఎంఏ మార్కాపురం శాఖ అధ్యక్షుడు డాక్టర్ వంశీక్రిష్ణ, డాక్టర్ ఫణి మాట్లాడుతూ వైద్య సిబ్బందికి కేంద్రం ప్రత్యేక రక్షణ చట్టం చేయాలని కోరారు. 24 గంటల పాటు అత్యవసర మినహా మిగిలిన వైద్యసేవలు నిలిపివేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ మోహన్ దాస్‌తో పాటు పలువురు వైద్యులు పాల్గొన్నారు. శ్రావణి హాస్పటల్‌లో డాక్టర్ సీహెచ్ కనకదుర్గ ఆధ్వర్యంలో సిబ్బంది నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు.



పొదిలిలో ర్యాలీ చేస్తున్న ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యులు


బేస్తవారిపేట: ర్యాలీలో పాల్గొన్న డాక్టర్లు, వైద్య సిబ్బంది


కంభంలో మానవహారంగా ఏర్పడిన వైద్య సిబ్బంది


మార్కాపురంలో నిరసన తెలుపుతున్న వైద్యులు

విగ్రహ ప్రతిష్ఠలో మాజీ ఎమ్మెల్యే అన్నా

మార్కాపురం రూరల్: మండలంలోని అమ్మవారిపల్లిలో గ్రామదేవతలు పోలేరమ్మ, పోతురాజు, సీతా కోదండ రామ లక్ష్మణ సమేత హనుమాన్ దేవతా మూర్తుల విగ్రహ ప్రతిష్ఠలో మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అన్నా రాంబాబు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. యజ్ఞకులు ఆయనతో కూస్మాండ బలి పూజ చేయించారు. మండలంలోని రాయవరంలో కనకదుర్గ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానాన్ని అన్నా రాంబాబు సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట పలువురు పార్టీ నాయకులు ఉన్నారు.


రాయవరంలో మల్లేశ్వర స్వామి ఆలయం వద్ద మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు

బీసీ బాలుర కళాశాల వసతి గృహం తనిఖీ

- నిర్వహణపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన జడ్జి బాలాజీ

మార్కాపురం: పట్టణంలోని కళాశాల రోడ్‌లో ఉన్న ప్రభుత్వ బీసీ బాలుర కళాశాల వసతి గృహాన్ని శనివారం మార్కాపురం కోర్టు జూనియర్ సివిల్ జడ్జి ఎం.బాలాజీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బాలుర వసతి గృహంలో అధ్వానంగా ఉన్న పరిస్థితిని చూశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. టాయిలెట్స్ డోర్స్ లేకపోవటం, అపరిశుభ్రంగా ఉండటాన్ని పరిశీలించారు. జడ్జి తనిఖీ చేసే సమయంలో వార్డెల్ అందుబాటులో లేరు. రిజిస్టర్ తనిఖీ చేయగా 80 మంది విద్యార్థులు ఉన్నట్లు ఉండగా, హాస్టల్‌లో 29 మంది మాత్రమే ఉన్నారు. భద్రత విషయంలో కూడా నిర్లక్ష్య ధోరణిగా ఉన్నారు. జడ్జి తనిఖీ చేసే సమయంలో ఎంట్రెన్స్ గేటు పక్కనే కాళ్ల జర్రి ఉండటాన్ని గమనించారు. ఆయన వెంట న్యాయవాదులు అన్వర్‌బేగ్, కడియం రామయ్య, మధుసూదన్ రెడ్డి ఉన్నారు.


హాస్టల్‌లో భోజనాన్ని పరిశీలిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి బాలాజీ

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

గిద్దలూరు రూరల్: బైక్‌పై వెళ్తున్న యువకుడిని లగేజీ వ్యాన్ ఢీకొట్టి గాయపరిచిన సంఘటన ఒంగోలు రోడ్డులోని కొత్తపట్నం రెస్టారెంట్ సమీపంలో శనివారం రాత్రి జరిగింది. కొమరోలుకు చెందిన మహేంద్ర అనే యువకుడు బైక్‌పై గిద్దలూరు వైపుగా వస్తున్న సమయంలో ఎదురుగా వస్తున్న వ్యాన్ ఢీకొట్టింది. ప్రమాదంలో మహేంద్రకు కుడికాలు, చేతులకు, తల వద్ద తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని చికిత్స కోసం గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.


బైక్‌ను ఢీకొన్న లగేజీ వ్యాను

ఆలయాల్లో భక్తుల సందడి


అలంకరణలో శ్రీవారు


పూజలందుకుంటున్న పోలేరమ్మతల్లి


ఆలయంలో ఉన్న భక్తులు

కొనకనమిట్ల: శ్రావణ మాసం శనివారం సందర్భంగా ప్రసిద్ధ పుణ్యక్షేత్రం వెలుగొండ వెంకటేశ్వరస్వామి ఆలయం, రేగడపల్లి వెంకటేశ్వరస్వామి, పోలేరమ్మతల్లి ఆలయాల్లో, కొనకనమిట్ల రామ ధూత క్షేత్రంలో భక్తుల సందడి నెలకొంది. శ్రీవారికి భక్తులు నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అర్చకులు తిరుమలాచార్యులు శ్రీలక్ష్మీ అలివేలుమంగా వెలుగొండ వెంకటేశ్వరస్వామి వార్లను పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ఈఓ ఈదుల చెన్నకేశవరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. మండలంలోని వాగుమడుగు పంచాయతీ రేగడపల్లి గ్రామం వెంకటేశ్వరస్వామి ఆలయం, పోలేరమ్మతల్లి ఆలయాల్లో భక్తులు అర్చనలు, అభిషేకాలు విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు విజయకాంత్‌శర్మ భూదేవి, శ్రీదేవి సమేత వెంకటేశ్వరస్వామి, పోలేరమ్మతల్లిని పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

వైభవంగా సీతారాములవారి ఆలయ వార్షికోత్సవం


కల్యాణంలో పాల్గొన్న భక్తులు


భక్తులకు అన్నదానం చేస్తున్న కమిటీ సభ్యులు

తర్లుపాడు: స్థానిక బీసీకాలనీలోని పట్టాభి సీతారామ స్వామి వారి మూడో వార్షికోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. స్వామివారికి అభిషేకాలు నిర్వహించి ఘనంగా కల్యాణం నిర్వహించారు. తర్లుపాడుతో పాటు నాయుడుపల్లి, మీర్జపేట, సీతానాగులవరం, చెన్నారెడ్డిపల్లి తదితర గ్రామాల నుంచి ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో మధ్యాహ్నం అన్నసంతర్పన నిర్వహించారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మార్కాపురం టౌన్: భవన నిర్మాణ రంగ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని జిల్లా సీపీఐ నాయకులు అందె నాసరయ్య డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని తాపీమేస్త్రీల సంఘం కార్యకర్తల సమావేశం ఏఐటీయూసీ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు అన్ని రాజకీయ పార్టీలు భవన నిర్మాణ రంగ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని, ఇసుక కొరత లేకుండా సరఫరా చేస్తామని చెప్పాయన్నారు. అయితే గతంలో కంటే ఎక్కువ ధరకు ఇసుక విక్రయిస్తున్నారని అన్నారు. భవన నిర్మాణ కార్మిక సంక్షేమ పథకం అమలు పరచాలని కోరారు. భవన నిర్మాణ రంగ కార్మికుల సమస్యలపై రేపు (సోమవారం) సబ్‌కలెక్టర్ కార్యాలయానికి ప్రదర్శనగా రావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి షేక్ ఖాశీం, తాపీమేస్త్రీల సంఘం అధ్యక్షుడు రామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి పి బుజ్జిబాబు, ఉపాధ్యక్షులు పీ వెంకటేశ్వర్లు, సెంట్రింగ్ కార్మికుల సంఘం నాయకులు ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అందె నాసరయ్య

మార్కాపురంలో దంచికొట్టిన వర్షం

- విద్యుత్ సరఫరాకు అంతరాయం

మార్కాపురం: మార్కాపురం ప్రాంతంలో శనివారం సాయంత్రం వర్షం దంచి కొట్టింది. మధ్యాహ్నం వరకు ఎండ వేడిమితో ఇబ్బంది పడిన ప్రజలు ఒక్కసారిగా వాతావరణం మారిపోయి వర్షం పడటంతో ఊపిరి పీల్చుకున్నారు. సుమారు అరగంట పాటు వర్షం పడింది. పట్టణంలో వీధులన్నీ జలమయం అయ్యాయి. ఇటీవల రైతులు పత్తి, మిర్చి, సజ్జ, కంది వేశారు. ఈ వర్షంతో పంటలకు జీవం పోసినట్లయింది. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


వర్షం కురుస్తుండటంతో నిర్మానుష్యంగా ఉన్న మార్కాపురంలోని ప్రధాన వీధి